# సింగరేణి ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

- సింగరేణి మందమర్రి ఏరియా జీఎం మనోహర్



మాట్లాడుతున్న జీఎం మనోహర్

మందమర్రి, డిసెంబర్ 13: ఈ నెల 23న మంద మర్రి పట్టణంలోని సింగరేణి పాఠశాల మైదానంలో నిర్వహించనున్న సింగరేణి ఆవిర్భావ వేడుకల ఏర్పాట్లకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఏరియా జీఎం ఏ.మనోహర్ సూచించారు. ఏరియా జీఎం కార్యాలయంలో బుధవారం ఏరియాలోని అన్ని విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మనోహర్ మాట్లాడుతూ వేడుకలలో ఆహార స్టాల్స్, కంపెనీకి సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేయడంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వేడుకల్లో భాగంగా ఈ నెల 18న మహిళలకు సీఈఆర్ క్లబ్‌లో త్రోబాల్, బాంబేబ్లాస్ట్, 19న దీపాలంకరణ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్తమ గృహాల ఎంపిక ఉంటుందన్నారు. ఆయా పోటీల్లో పాల్గొనే వారు ఈ నెల 18న ఏరియా పర్సనల్ విభాగంలో పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. తినుబండారాల స్టాళ్లు ఏర్పాటు చేసే వారు ఈ నెల 20న పర్సనల్ విభాగంలో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏరియా అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

**మందమర్రి జీఎంకు ఘన సన్మానం**

శ్రీరాంపూర్‌లో ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు జరిగిన సింగరేణి ఆఫీసర్స్ క్లబ్ షటిల్, టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్-2023లో గెలుపొందిన మందమర్రి జీఎం ఏ.మనోహర్‌ను స్థానిక జీఎం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎంఓఏఐ ఆధ్వర్యంలో సన్మానించారు. జీఎం మనోహర్ టేబుల్ టెన్నిస్ సింగిల్స్ విభాగంలో మొదటి బహుమతి, డబుల్ విభాగంలో ప్రథమ బహుమతులను సాధించారు. జీఎం కార్యాలయంలో తన చాంబర్‌లో కార్యాలయ అధికారులు, సిబ్బంది ప్రశంసిస్తూ శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్వోటూ జీఎం రాజేశ్వర్ రెడ్డి, సీఎంవోఏఐ సభ్యులు డివైఎస్ఎస్వో నర్సయ్య, సీనియర్ ఏవో రమేశ్, డీజీఎం(ఐఈడీ) రాజన్న, పర్సనల్ మేనేజర్ శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

**సింగరేణి కీర్తిని దశదిశలా చాటాలి**

సింగరేణి కీర్తిని దశదిశలా చాటేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సింగరేణి మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఏ.మనోహర్ అన్నారు. ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు నాగపూర్‌లో జరిగిన కోలిండియా డబ్ల్యూసీఎల్ 90 కేజీ బాడీ బిల్డింగ్ విభాగంలో బంగారు పతకం సాధించిన మందమర్రి ఏరియాలోని వర్క్‌షాప్‌లో ఎలక్ట్రికల్ ఫోర్‌మెన్‌గా పని చేస్తున్న బీ వెంకటస్వామి జీఎం మనోహర్ అభినందించి సన్మానించారు. ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జీఎం మనోహర్ మాట్లాడుతూ వెంకటస్వామిని స్ఫూర్తిగా తీసుకుని మిగతా క్రీడాకారులు సైతం సింగరేణికి మంచి పేరును తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్వోటూ జీఎం రాజేశ్వర్ రెడ్డి, పీఎం శ్యామ్‌సుందర్, డీవైపీఓం మైత్రేయ బంధు, ఎండీ ఆసీఫ్, డీవైపీఎం డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ హానర్ సెక్రటరీ ఎం.కార్తీక్, రవికుమార్, చిన్నయ్య, గ్రౌండ్ ఇన్‌చార్జి నస్పూరి తిరుపతి తదితరులున్నారు.

# ఆనంద్ మేళాను విజయవంతం చేయండి

- కార్యక్రమ పోస్టర్ విడుదల చేసిన ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి



పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 13: జనవరి 1వ తేదీన కాగజ్‌నగర్ పట్టణంలో నిర్వహించే ఆనంద్ మేళా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ సంబంధించిన పోస్టర్లను ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి బుధవారం మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి బుధవారం తన నివాసంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళలు అంతరించిపోకుండా ప్రాణం పోస్తూ కళాకారుల్లో ఉన్న కళను వెలికి తీయలనే లక్ష్యంతో ప్రతి యేటా ఆనంద్ మేళా నిర్వహించడం అభిందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ గాయకుడు ఇర్ఫాన్, నిర్వహకులు, బీఆర్ఎస్ నాయకుడు శ్రీధర్ తదితరులున్నారు.

## నాణ్యమైన భోజనం అందించాలి

ఉట్నూర్, డిసెంబర్ 13: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. బుధవారం ఉట్నూర్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా గిరిజన గురుకులాల ప్రిన్సిపాళ్ల సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు అందుతున్న విద్య, భోజన సదుపాయాలపై ఆరా తీశారు. ఏమైన నిర్మాణాలు అవసరమైన చోట చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డీడీ దిలీప్ కుమార్, ఆర్‌సీవో గంగాధర్, ఉమ్మడి ఆదిలాబాద్ ప్రిన్సిపాల్స్, సిబ్బంది పాల్గొన్నారు.

## గ్యాస్ కేవైసీ కోసం బారులు...



కేవైసీ చేస్తున్న నిర్వాహకులు



బారులు తీరిన వినియోగ దారులు

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని ప్రకటించడంతో గ్యాస్ ఏజెన్సీల ముందు వినియోగదారులు కేవైసీ అప్‌డేట్ కోసం బారులు తీరుతున్నారు. ఉదయం నుంచే వినియోగదారులు ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డులు, గ్యాస్ బుక్‌లతో పెద్ద మొత్తంలో బారులు తీరుతున్నారు. ప్రభుత్వ పథకాలకు గ్యాస్ కేవైసీ అప్‌డేట్‌కి ఎలాంటి సంబంధం లేదని నిర్వాహకులు చెబుతున్నా తమకు సబ్సిడీ సిలిండర్ ఎక్కడ దూరం అవుతుందోనని భయంతో పోటీపడి మరీ గ్యాస్ ఏజెన్సీల వద్దకు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు.

- మంచిర్యాల స్టాఫ్ ఫోటో గ్రాఫర్

# రైతులు ఆర్థిక అభివృద్ధి సాధించాలి

- బెల్లంపల్లి కృషి విజ్ఞానకేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ కే శివకృష్ణ



రైతులు, మహిళలకు చేప పచ్చళ్లను తయారీ చేసి చూపిస్తున్న శాస్త్రవేత్తలు

బెల్లంపల్లిరూరల్, డిసెంబర్ 13: రైతులు ఆర్థిక అభివృద్ధి దిశలో పయనించాలని బెల్లంపల్లి కృషి విజ్ఞానకేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ కే శివకృష్ణ అన్నారు. బుధవారం కృషి విజ్ఞాన కేంద్రంలో నేషనల్ ఫిషరీ డెవలప్‌మెంట్ బోర్డ్ ఆధ్వర్యంలో చేపల పెంపకం, చేప ఆధారిత ఉత్పత్తుల తయారీపై కొనసాగుతున్న మూడవ రోజు అవగాహన కార్యక్రమంలో రైతులనుద్దేశించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల రైతులు కేవలం వ్యవసాయ విధానాలపై ఆధారపడకుండా వ్యవసాయ ఆధారిత పరిశ్రమలైన మత్స్య విభాగంపై కూడా దృష్టి పెట్టాలని కోరారు. చేపల, రొయ్యల పచ్చళ్ల వంటి ఆధారిత ఉత్పత్తుల ద్వారా అదనపు ఆదాయాన్ని పొందుతూ ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చని సూచించారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంత మహిళలకు వ్యవసాయ ఆధారిత విధానాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం ఎంపిక చేసిన 25 మంది గ్రామీణ ప్రాంత రైతులకు చేప పచ్చళ్ల తయారీని ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో మత్స్య విభాగపు శాస్త్రవేత్త డాక్టర్ రామగిరి మహేశ్, ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ నాగరాజు, డాక్టర్ తిరుపతి వివిధ గ్రామాల రైతులు, మహిళలు పాల్గొన్నారు.

## కుమ్రంభీం విగ్రహావిష్కరణ



కుమ్రంభీం విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

కాసిపేట, డిసెంబర్ 13 : కాసిపేట మండలంలోని రొట్టెపెల్లిలో బుధవారం కుమ్రం భీం విగ్రహావిష్కరణ చేపట్టారు. ముందుగా తమ సంప్రదాయ పద్ధతిలో పూజలు నిర్వహించి అనంతరం విగ్రహావిష్కరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఎంపీపీ రొడ్డ లక్ష్మి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి, సర్పంచ్‌లు ఆడె జంగు, ఏదుల విజయలక్ష్మి, పెంద్రం హన్మంతు, వెడుమ కిషన్ తదితరులున్నారు.

## వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలి

- డీపీవో వెంకటేశ్వర్లు

నెన్నెల, డిసెంబర్ 13 : మండలంలోని ప్రతి గ్రామపంచాయతీలో వందశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు సూచించారు. నెన్నెల గ్రామపంచాయతీని ఆకస్మికంగా తనిఖీ చేసిన డీపీవో గ్రామంలో పారిశుధ్య చర్యలను పర్యవేక్షించారు. గ్రామంలో ప్రతి రోజూ తడి, పొడి చెత్తలను సేకరించి డంప్ యార్డ్‌కు తరలించాలన్నారు. సేకరించిన చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువులు తయారు చేయాలని సూచించారు. గ్రామంలో ప్రతిరోజూ పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించాలని, రోడ్లపై చెత్త లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని పారిశుధ్య సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తోట సూజాత, ఏపీవో శ్రీనివాస్, వార్డు సభ్యులు ఉన్నారు.



నెన్నెలలో రోడ్లను పరిశీలిస్తున్న డీపీవో వెంకటేశ్వర్లు

## మహిళల సంక్షేమానికి సాధికారత హబ్ కృషి

- హబ్ జిల్లా కో-ఆర్డినేటర్ సౌజన్య



మాట్లాడుతున్న జిల్లా కో-ఆర్డినేటర్ సౌజన్య

సీసీసీ నస్పూర్, డిసెంబర్ 13: బాలికలు, మహిళల సంరక్షణ, సంక్షేమం, అభివృద్ధికి మహిళా సాధికారత హబ్ కృషి చేస్తుందని మహిళా సాధికారత హబ్ మంచిర్యాల జిల్లా కో-ఆర్డినేటర్ సౌజన్య తెలిపారు. బుధవారం నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని తీగల్‌పహాడ్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కృష్ణవేణి పాఠశాలలో హబ్ జెండర్ స్పెషలిస్టులు మౌనిక, విజయ, ఆర్థిక అక్షరాస్యత నిపుణురాలు లిప్సిక మహిళా సాధికారతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హబ్ కో-ఆర్డినేటర్ మాట్లాడుతూ జిల్లా సంక్షేమాధికారి ఆదేశాల మేరకు మహిళా సాధికారత హబ్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బాలికలు, మహిళల సంరక్షణ కోసం చేపట్టిన కార్యక్రమాలు, మహిళా చట్టాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. భేటీ బచావో-భేటీ పడావో, లింగ వివక్షత, లింగ సమానత్వం, బాలిక విద్య, బాల్యవివాహాల నిరోధక చట్టం, గుడ్ టచ్-బాడ్ టచ్, సైబర్ క్రైం, మహిళా హెల్ప్‌లైన్స్-181, చైల్డ్ హెల్ప్‌లైన్-1098, పోలీస్ హెల్ప్‌లైన్-100, సీనియర్ సిటిజన్ హెల్ప్‌లైన్-14567, తదితర అంశాలపై విద్యార్థులకు వివరించడం జరిగిందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.